


# రేఖ-శశిరేఖ

బి. విశ్వం



కల్యాణ మంటపంలో ముచ్చటగా కూర్చుని ఉన్నారు గోపాలం-శశిరేఖలు బయట బాజాబజంత్రీలు వారి ఆనందానికి శృతి కలిపి పాడుతున్నాయి పురోహితుడు మంత్ర పఠనం సాగిస్తున్నాడు ఆ సంస్కృత మంత్రాల అర్థం తెలియక పోయినా పురోహితుని సంజ్ఞప్రకారం అక్షతలు జల్లి తాళికట్టి కూర్చున్నాడు గోపాలం శశిరేఖ యిప్పుడు గోపాలం భార్య ఆ పందిట్లోనే గోపాలం శశిరేఖను చూచి చిరునవ్వు నవ్వాడు ఆ చిరునవ్వు అర్థం వేరు

అదే చిరునవ్వు నాలుగు సంవత్సరాలకు ముందు గోపాలం మొట్టమొదటి సారిగా శశిరేఖను కాలేజీలో చూచినప్పుడు నవ్వాడు అప్పుడు శశిరేఖ సిగ్గుతో తలవంచుకుంది _గోపాలం

చిరునవ్వుకి అది సమాధానం వారి మనస్సుల కలయికకది మొదటి మెట్టు

సంవత్సరం లోగానే శశిరేఖా గోపాలం గాఢ ప్రేమికులయారు శశిరేఖ యింటికి తరుచూ రాకపోకలు సాగిస్తున్నాడు గోపాలం గోపాలానికి శశిరేఖ తలిదండ్రులతో, శశిరేఖ చెల్లెలు రేఖతో కూడా పరిచయం కలిగింది

రేఖ శశిరేఖకంటె రెండు సంవత్సరాలు చిన్నది ఇద్దరూ రూపంలో గుణంలో, కవలలు అందుకే తలిదండ్రులు పేర్లు కూడా రేఖ, శశిరేఖ అని పెట్టారు రేఖ శశిరేఖ కంటే చురుకయిన పిల్ల శశిరేఖకు సిగ్గు భయం రేఖకు చొరవ, ధైర్యం ఎక్కువ.

శశిరేఖా, గోపాలం ప్రేమికులయినా ఆ విషయాన్ని బయట పెట్టడానికి జంకారు మిత్రులలాగ మెలిగారు వారితో పాటు రేఖ కూడా ఎప్పుడూ ఉండేది

గోపాలం, శశిరేఖలు బి ఏ డిగ్రీ ముగించారు రేఖ అప్పుడే బి ఏ లో ప్రవేశించింది గోపాలం తన సొంత ఊరయిన కాకినాడకు బయలుదేరాడు ఉద్యోగార్థం శశిరేఖకు దుఃఖం ముంచుకొచ్చింది. కాని గోపాలం తనతో ఏకాంతంగా "మా నాన్నతో చెప్పి మన వివాహం ఏర్పాటు చేస్తాను నిన్ను విడిచి నేను మాత్రం ఉండగలనా" అన్నమాటలు ప్రతిధ్వనించి ధైర్యాన్నిస్తున్నాయి

గోపాలం కాకినాడలో తన మనస్సులోని కోరికను తలితండ్రులతో చెప్పాడు ఏరి కోరి చక్కని చుక్కను తెచ్చుకుంటామంటే వద్దంటామా అన్నారు తలిదండ్రులు

గోపాలం ఈ శుభవార్తను వెంటనే శశిరేఖకు తెలియ జేయాలని నిశ్చయించాడు ఈ వార్తను రేఖకు కూడా వ్రాయాలనుకున్నాడు ఇద్దరికీ జాబులు వ్రాశాడు కవరులలో పెట్టి పోస్టు చేశాడు

శశిరేఖ. రేఖ, యిద్దరూ గోపాలం వద్దనుండి జాబులు రావడం చూచి మురిసిపోయారు జాబులు తెరిచి చదివారు శశిరేఖ కంట గిర్రుమని నీరు తిరిగింది కళ్లు చీకట్లు క్రమ్మాయి. లోకం అంతా చీకటయింది ఏడుస్తూ మంచం మీద వ్రాలింది

ప్రక్క గదిలోనుండి రేఖ ఆనందంతో నవ్వుకుంటూ, కులుకుతూ తన జాబును తెచ్చింది రేఖకు చూపడానికి. రేఖ రావడం చూచి లేనినవ్వు తెచ్చుకొని "నువ్వు అదృష్టవంతురాలివి చెల్లీ" అంది శశిరేఖ.

"నీకెలా తెలుసక్కా ?" అని అడిగింది రేఖ. శశిరేఖ తన చేతిలోని జాబును రేఖకు అందించింది. రేఖ జాబు చదువ సాగింది

"మిత్రురాలికి,

మీ యోగక్షేమాలను గూర్చి తెలియ లేదు. ఈ జాబు మూలంగా నీ కొక శుభ వార్తను తెలియజేయా లనుకుం టున్నాను. మీ సోదరితో నాకు పరిచయ మయిన నాటినుండి మా మనుసులు కలిశాయి. వివాహం చేసుకోవాలని నిశ్చ యించాము. ఆ నిశ్చయాన్ని మా తలి తండ్రులకు తెలియజేశాను. వారు అంగీక రించారు. ఇంక మీ తలితండ్రుల అంగీ కారం కూడా లభిస్తే మీ అందరకీ ఇంకా ఆప్తుడను కాగల భాగ్యం లభిస్తుంది.

ఇట్లు
గోపాలం."

ఈ జాబు చదివి రేఖ శశిరేఖ ప్రక్కనే కూర్చుంది. "నిజానికి అక్కా, నా మనస్సులో గోపాలాన్ని చూచి నపుడు ఏవేవో ఊహాలున్నా, ఆయన కూడా నన్నుగూర్చి కలలు గంటున్నా డని ఊహించలేకపోయాను" అంది.

శశిరేఖ లోలోపల దుఃఖం పొరలు కొస్తున్నా లేని ధైర్యాన్ని తెచ్చుకొని చిరునవ్వు నవ్వింది.

"అక్కా, మరి ఈ మాట నాన్న తోనూ, అమ్మతోనూ ఎలా చెప్పడం?" అని అడిగింది రేఖ.

"ఏది చెల్లీ, ఆ జాబు యివ్వు. నాన్నతో, అమ్మతో నేను చెబుతాను" అని ఆ జాబును తీసుకుంది.

రేఖ సంతోషంతో అద్దం ముందుకు పరుగులెత్తింది. శశిరేఖ ఆ జాబుతీసి చదివింది.

"నాహృదయ సుందరికి —

ఈ విధంగా నిన్ను పిలవాలని ఎన్నో రోజులనుండి కలలు గంటున్నాను. ఆ విషయమే మా తలిదండ్రులకు తెలియ జేశాను. మన వివాహానికి అంగీకరిం చారు. ఇంక మీ పెద్దల అంగీకారమే ఆలశ్యం.

ఇట్లు
నీ గోపాలం".

ఎంత మోసం చేశాడు గోపాలం. కాని అతని తప్పేముంది. నాకంటె చెల్లి చురకయినది అనుకొని మళ్ళీ కన్నీరు కార్చింది శశిరేఖ.

చెల్లెలి పెళ్ళి విషయమై తలితండ్రు లకు తెలియ పరచింది శశిరేఖ. వారి అంగీకారాన్ని తెలిపినా ముందు అక్క పెళ్ళి అయితేగాని చెల్లెలిపెళ్లి చేయడం సవ్యంకాదని స్పష్టపరచారు. ఆ విషయమై శశిరేఖతండ్రి గోపాలా నికి జాబు వ్రాశాడు.

గోపాలం జాబు చూచి కొయ్యబారి పోయాడు. తేరుకొని మళ్ళీ మళ్ళీ చదివాడు.

"చి॥ గోపాలం,

నీవు మా రేఖకు వ్రాసిన జాబు చూచాను. మీ యిద్దరి మనస్సులు కలిసి

నప్పుడు వివాహం జరిపించడానికి మా అభ్యంతరం లేదు కాని, ఒక్క షరతు మా పెద్దమ్మాయి శశికి ముందుగా వివాహం జరగాలి అందుచేత నీవు ఒక్క సంవత్సరకాలం వివాహాన్ని వాయిదా వేసుకోవాలి ఈ షరతు సబబుగా ఉంది కనుక నీ అంగీకారం లభిస్తుందని ఆశిస్తున్నాను "

తలిదండ్రులకి కూడా చెప్పకుండా రైలెక్కాడు గోపాలం తను ప్రేమించినది శశిరేఖను కాని ఈ పొరపాటు ఎక్కడ జరిగింది? ఈఆలోచనల లోనే మునిగి గోపాలం మద్రాసు చేరాడు శశిరేఖ యింటికి వెళ్లాడు

గుమ్మంలో రేఖ సిగ్గుతో తలవంచుకొని ఓ కంట చూచి "ఏవండీ, అకస్మాత్తుగా వచ్చారు" అని ప్రశ్నించింది కొంటెగా

"రేఖా, గొప్ప పొరపాటయింది నీతో ఒక్క నిముషం మాట్లాడాలి అందుకే అంతదూరం నుండి వచ్చాను" ఏకదాటిగా చెప్పాడు గోపాలం

రేఖకు అతని తొందరపాటు అర్థం కాలేదు ఏం జరిగిందని ప్రశ్నించింది

"రేఖా, మీ అక్క శశిరేఖను నేను ప్రేమించాను ఆమె కూడా నన్ను ప్రేమించింది మేం యిద్దరం వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నాం" అన్నాడు

"మరి నాకు వ్రాశారు కదండీ" అంది రేఖ అమాయకపు చూపు చూస్తూ

"అదే, పొరపాటు జరిగింది. ఆ జాబు మీ అక్కకు ఉద్దేశించి వ్రాసినది. బహుశా కవర్లు మారి ఉండవచ్చు. జాబులలో మీ పేర్లు వ్రాయక పోవడం వల్ల ఈ పొరపాటు జరిగి ఉండవచ్చు రేఖా! ఈ సమయంలో నువ్వే నన్ను కాపాడాలి" అంటూ బ్రతిమాలాడు.

రేఖ ఒక్క నిమిషం మౌనం వహించింది తన చీర కొంగుతో నుదటి చెమట తుడుచుకుంది కనుబొమ్మలు పైకెత్తి చిరునవ్వు నవ్వి గోపాలం చెయ్యి పట్టుకొని "రా బావా జరిగిందంతా యింట్లో చెబ్దాం" అని గోపాలన్ని లోపలకు ఈడ్చుకు పోయింది

నెల తిరగక ముందే గోపాలానికి—శశిరేఖకు వివాహ ముహూర్తం పెట్టారు వివాహం జరిగింది కాలేజీలో చూపులు కలిసిన నాటి చిరునవ్వే కల్యాణ మంటపంలో నవ్వుకున్నారు. దూరం నుండి వారి ఆనందాన్ని చూసి తనలో తాను నవ్వుకుంది రేఖ